


# సమరోత్సాహం

## మరింత పెరిగిన బీఆర్ఎస్ గ్రాఫ్

- అచ్చంపేట, వనపర్తిలో సీఎం సభలు సక్సెస్
- రెండుచోట్ల ఉవ్వెత్తున ఎగిసిన అభిమానం
- లక్షలాదిగా కదలివచ్చిన జన ప్రవాహం
- కదంతొక్కుతూ రెట్టింపు సంఖ్యలో రాక
- సీఎం కేసీఆర్ ప్రసంగానికి జనం ఫిదా
- బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్..







వనపర్తి సభకు హాజరైన జనం

వనపర్తి , అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : వనపర్తిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ అయింది. సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు నూతనోత్సాహంలో మునిగిపోయారు. నియోజక వర్గంలో ఇతర పార్టీల ఊసేలేని క్రమంలో రెండు నెలలుగా బీఆర్ఎస్ ప్రచార నిర్వహణలో విజయ ఢంకా మోగిస్తున్నది. ఎన్నికల షెడ్యూల్ విడు దలకు ముందు నుంచే వివిధ వర్గాల సమ్మేళనాలను నియోజకవర్గమంతటా నిర్వహించి బీఆర్ఎస్ దూకుడు పెంచింది. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్య ర్థులను ప్రకటించి బీఫారంలను అందజేయడంతో క్రమ తప్పకుండా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ స్పీడ్ పెంచింది. ప్రజా ఆశీర్వాద సభలోను సీఎం కేసీఆర్ మంత్రి నిరంజన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని, అంతకు ముందు తెలంగాణ ఉద్యమంలో సింగిరెడ్డి ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. గతంలో మాదిరిగానే మళ్లీ మీరు నిరంజన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ..మిగితా పని నేను చూసుకుంటా అన్నట్లు సభలో ఓటర్లకు గెలుపు బాధ్యతను అప్పగించారు ముఖ్యమంత్రి. నిత్యం జనంలో ఉంటూ ప్రాంత అభివృద్ధి కోసం పరితపించే నిరంజన్ రెడ్డిలాంటి వ్యక్తులను ప్రజలుగా మీరు ఆదరించాలని, అలాంటప్పుడే ఈప్రాంతం మరింతగా వృద్ధిలోకి వస్తుందని సీఎం భరోసాగా చెప్పారు.

### చేరికలతో బలోపేతం..

వరుస చేరికలతో బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతున్నది. గడిచిన 3నెలలుగా గ్రామాల్లో ఉన్న ముఖ్య నాయకులు బీఆర్ఎస్‌లో చేరిపోయారు. ఇంకా అక్కడక్కడ మిగిలిన వారు సహితం గులాబీ కండువా కప్పుకోవడంతో ఇతర పార్టీలన్నీ ఖాళీ అవుతున్నాయి. దీంతో నియోజవర్గంలో బీఆర్ఎస్ తిరుగులేని పార్టీగా ఎదుగుతున్నది. ఇటీవల మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో నియోజకవర్గంలో కొత్త జోష్ కనిపిస్తున్నది. ప్రజా ఆశీర్వాద సభలోనూ గోపాల్‌పేట మండలానికి చెందిన నాగం తిరుపతిరెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఇక ప్రతి రోజూ మంత్రి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి చేరికల కార్యక్రమం జోరుగా కొనసాగుతున్నది. అభివృద్ధి, ఇతర సంక్షేమ పథకాలపై ఆకర్షితులవుతున్న ఇతర పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారు. మంత్రి కూడా గతంలో కంటే ఎక్కువగా నియోజకవర్గంలోనే ఉంటూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నాయకులు, కార్యకర్తలకు ఎప్పటికప్పుడు దిశా..నిర్దేశం చేస్తూ గులాబీ శ్రేణులను అప్రమత్తంగా ఉంచుతున్నారు. పార్టీలో కొత్తగా చేరుతున్న వారికి పాత కార్యవర్గాన్ని సమన్వయం చేస్తూ ఎలాంటి ఒడిదుడులకు లోనుకాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### కోటపై గులాబీ జెండా రెపరెపలు..

వనపర్తి కోటపై మరోసారి గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని బీఆర్ఎస్ భరోసాగా ఉన్నది. ముందు నుంచి ప్రణాళికతో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న పార్టీ బాధ్యులు గతంలో కంటే మెరుగైన పరిస్థితుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి సింగిరెడ్డి నుంచి మొదలుకుని వివిధ హోదాల్లో పదవులను నిర్వహిస్తున్న నాయకులు, మండలాల బాధ్యులు రాజకీయ పరిస్థితులను అంచనా వేసుకుంటూ పార్టీ ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. నోటిఫికేషన్‌కు ముందు నుంచి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బిజీగా గడిపిన మంత్రి నిత్యం ప్రజా క్షేత్రంలోనే గడుపుతున్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో నడుస్తూ ఇంటింటికీ వెళ్లి మంత్రి ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి కోటపై మరోసారి గులాబీ జెండాను ఎగరవేస్తామని బీఆర్ఎస్ గట్టి విశ్వాసంతో ముందుకు వెళ్తున్నది.

### అలికిడి లేని ప్రతిపక్షాలు

నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీల అలికిడి లేకుండా పోయింది. బీఆర్ఎస్ మినహా ఇతర పార్టీల నుంచి అభ్యర్థిత్వాలు ఖరారు కాకపోవడంతో గందరగోళం నెలకొన్నది. ఉన్న క్యాడర్ కూడా ఆయోమయ సంకట స్థితిని ఎదుర్కొంటున్నది. గడచిన ఐదేండ్ల కాలంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు దూరంగానే కొనసాగాయి. ప్రజల వద్దకు వెళ్లేందుకు ఏ సమస్యా ప్రధానంగా లేకపోగా, నామమాత్రంగా కొన్ని పార్టీలు తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేశాయి. ఉద్యమ పంథాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల ధాటికి ప్రతిపక్షాలు వెలవెలబోతున్నాయి. ఇదంతా గమనిస్తున్న ఆయా పార్టీల క్యాడర్ ఇప్పటికే బీఆర్ఎస్‌లోకి వలస బాట పట్టింది.

# సీఎం సభ సక్సెస్

- విప్ గువ్వల బాలరాజుకు జనాదరణ
- అచ్చంపేటలో ప్రతిపక్షాలు కుదేలు..

అచ్చంపేట, అక్టోబర్ 27: ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ పాల్గొన్న అచ్చంపేట ప్రజాఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయింది. అచ్చంపేట నలువైపులా ఎటుచూసినా జనం.. గులాబీ ప్రభంజనాన్ని తలపించింది. బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు ఆశించిన దానికంటే రెట్టింపు ఉత్సాహంతో ప్రజానీకం తరలిరావడంతో అచ్చంపేట గులాబీవనాన్ని తలపించింది. ఈ సభ ద్వారా అచ్చంపేటలో బీఆర్ఎస్ పార్టీకి మరింత గ్రాఫ్ పెరిగింది. పదేండ్లలో కళ్లరా కనిపిస్తున్న అభివృద్ధిని చూస్తున్న నల్లమల ప్రజానీకం మూడోసారి సీఎం కేసీఆర్‌ను దీవించి సీఎం సీట్లో కూర్చోబెట్టి ఆశీర్వదించేందుకు మహిళలు, యువత, అభిమానులతోపాటు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. అచ్చంపేట చరిత్రలో ఇంతపెద్ద సభ ఏప్పుడు జరుగలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎవరి నోటవిన్న ఏం సభ, ఇంతమంది వస్తారని అనుకోలేదు, అచ్చంపేట మొత్తం జనాలతో నిండిపోయింది, ఇక బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరనే చర్చించుకుంటున్నారు. రాజకీయ అనుభవం ఉన్నవారు, ఆసక్తి ఉన్నవారు, రాజకీయ పార్టీలు ఎక్కడ నలుగురు కలిసినా ఈ సభ గురించే చర్చించుకోవడం వినిపించింది. సభకు వచ్చి వెళ్లిన వారు గ్రామాలు, పల్లెలు, పట్టణాల్లో ఈ సభ గురించే మాట్లాడుకోవడం కనిపించింది.

### ప్రతిపక్షాలు కుదేలు..

అచ్చంపేటలో సీఎం కేసీఆర్ సభ ద్వారా అచ్చంపేటలో బీఆర్ఎస్ గ్రాఫ్ మరింత పెరిగినట్లు ఇంటెలిజెన్స్‌వర్గాలు తెలిపాయి. సభను చూసిన తర్వాత ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రతిపక్షాలు ఆలోచనలో పడ్డారని అక్కడక్కడ గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే సభకు వచ్చే వారి సంఖ్యను చూసిన తర్వాత ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోవడం లేదు. బయట మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న లోపల ఓటమి భయం పట్టుకుంది. నిన్న మొన్నటి వరకు గల్లలు ఎగిరేసిన ప్రతిపక్షాలు సభ చూసిన జనాన్ని చూసి ఆలోచనలో పడ్డారు. అచ్చంపేటలో బీఆర్ఎస్ విజయం తేలిపోయింది. మరోసారి అచ్చంపేటలో కాంగ్రెస్ ఖతం కానున్నదని తెలుస్తోంది. జనం స్పందన బట్టి బీఆర్ఎస్ గెలుపును ఆపేశక్తి ఎవరికీ లేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ప్రతిపక్షాలు భయపడి గ్రామాల నుంచి సభకు ఎంత మంది, ఎవరెవరు వెళ్లారనేది ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అచ్చంపేట కాంగ్రెస్ శ్రేణులు ఢీలా పడడంతోపాటు పునరాలోచన చేస్తున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందనడానికి సభకు వచ్చిన జనమే నిదర్శనంగా చెప్పవచ్చు. గ్రామాలు, పల్లెలు, పట్టణాలు, తండాలు, గూడేల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ మరింత పెరిగింది. అచ్చంపేట సభకు వేలాదిగా తరలివచ్చిన జనం ఎండను సైతం లెక్కచేయకుండా సీఎం కేసీఆర్ ప్రసంగం మొత్తం ఈలలు, కేకలు, కేరింతలతో జోష్‌గా సాగింది. సభకు వచ్చిన వారందరూ ఎంత జోష్‌తో ఉత్సహంతో ఉన్నారో దీనినిబట్టి తెలిసిపోయింది. అచ్చంపేట గడ్డపై మూడోసారి గులాబీ జెండ ఎగురడం ఖాయంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### కాంగ్రెస్ నేతల చూపు.. బీఆర్ఎస్ వైపు..

అచ్చంపేటలో మూడోసారి బీఆర్ఎస్ గెలుపు ఖాయంగా మారడంతో కొందరు ముఖ్యులు కాంగ్రెస్‌ను వీడేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వారిలో కొందరు అంతర్మథనంలో పడ్డారు. అనవసరంగా బీఆర్ఎస్‌ను వీడినట్లు మధనపడుతున్నారని తెలిసింది. ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఉన్న స్పందన చూసిన తర్వాత ప్రతిపక్షాల క్యాడర్ ఆలోచనలో పడ్డారని అంటున్నారు. కొందరు కాంగ్రెస్‌లో వచ్చేందుకు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిసింది. అయితే కొందరు బీఆర్ఎస్ నేతలు వారిని పార్టీలోకి తీసుకోవద్దని వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఫారం తీసుకొని అచ్చంపేట వచ్చిన సందర్భంగా దాదాపు పదివేల మందితో చేపట్టిన భారీ బైక్‌ర్యాలీ, సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభను చూసిన తర్వాత ప్రతిపక్ష నేతలు పునరాలోచనలో పడ్డారు. ఇక కాంగ్రెస్‌లో పని చేసినా అనవసరమని భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ శ్రేణులే హోటళ్లు, టీస్టాల్స్, నలుగురు కలిసిన దగ్గర కాంగ్రెస్ గెలువదని చెబుతున్నారంట. ఇంతకుముందు ఏదో అనుకున్నామని, కానీ సభకు వచ్చిన ప్రజలను చూసిన తర్వాత ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని మధనపడుతున్నారని తెలిసింది.

### ప్రజల్లో విశ్వాసం పెంచిన సీఎం వరాలు

సీఎం కేసీఆర్ అచ్చంపేటకు వరాలు ప్రకటించడంతో ప్రజల్లో మరింత విశ్వాసం పెంచింది. గతంలో అచ్చంపేటను ఏ పాలకులు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అభివృద్ధిలో పరుగులు పెడుతున్నది. అభివృద్ధి కూడా కండ్లముందు కనిపిస్తోంది. అప్పర్‌ప్లాట్‌కు చివరలో ఉన్న మద్దిమడుగుకు కూడా ఇంటింటికీ మీషన్‌భగీరథ జలాలు అందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడంతోపాటు అచ్చంపేటకు సాగునీళ్లు అందించే ప్రక్రియ మొదలు పెడుతానని గత ఎన్నికల సందర్భంలో సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. అప్పర్‌ప్లాట్ సాగునీటి పథకాన్ని రూపకల్పన చేసి ఎత్తిపోతల పథకం పనులు ప్రక్రియ ప్రారంభం కావడంతో ప్రజల్లో మరింత విశ్వాసాన్ని నింపింది. మరోసారి ఎవరూ ఊహించని విధంగా సీఎం కేసీఆర్ అచ్చంపేటకు మహిళా డిగ్రీ గురుకుల కళాశాల, నర్సింగ్ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే జీవో మంజూరు చేస్తానని ప్రకటించడంతో సభీకుల నుంచి మద్దతు లభించింది. అదేవిధంగా ఉమామహేశ్వరం, మల్లెలతీర్థం, సలేశ్వరం ఇతర పుణ్యక్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా మరింత అభివృద్ధి చేస్తామని, అప్పర్‌ప్లాట్‌కు సాగునీరు అందించే బాధ్యత నాదేనని ప్రకటించారు. నియోజకవర్గవ్యాప్తంగా దళితబంధు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఈవిధంగా అచ్చంపేటకు వరాలు కురిపించడంతో అచ్చంపేట ప్రజానీకం పులకించిపోయారు. ప్రజలు ఆశించిన అభివృద్ధి జరుగుతుండడంతోపాటు వరాలు ప్రకటించి అచ్చంపేటను మరింత అభివృద్ధిలో పరుగులు పెట్టించే విధంగా సీఎం కేసీఆరే స్వయంగా హామీ ఇవ్వడంతో ప్రజల్లో మరింత విశ్వాసం పెంచింది. అచ్చంపేటలో ఇవన్నీ రావాలంటే ముందు గువ్వల బాలరాజును గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది.

### ప్రజలకు ధన్యవాదాలు

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**



అచ్చంపేట సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు ప్రజానీకం ఊహించినదానికన్న రెట్టింపు స్థాయిలో వచ్చి విజయవంతం చేశారు. ఎండను లెక్కచేయకుండా ప్రజల స్వచ్ఛందంగా రావడం మాకు మరింత బలాన్నిచ్చింది. సభలో ప్రజలు చూపించిన ఉత్సాహాన్ని చూసిన తర్వాత మూడోసారి అచ్చంపేటలో 50వేల మెజారీతో గెలువడం ఖాయమని తేలిపోయింది. ఇక అచ్చంపేట గెలుపును ఆపే దమ్ము ఏ పార్టీకి లేదు. ప్రజలు సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌పార్టీపై ఉన్న అభిమానాన్ని చాటిచెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అచ్చంపేటకు సాగునీరు అందించి తీరుతా.. సభను విజయవంతం చేసిన ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు, వృద్ధులు, మైనార్టీలు, గిరిజనులు, బంజారులు, దళితులకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.